
# ఈవి

బి.కె.ప్రసాద్



పెద్దాసుపత్రిలో వాళ్లాయన తరుపు మనిషిని చూడడానికి మా స్వస్థలం నుండి, చిట్టి ఈ ఊరు వచ్చి ఉండకపోతే నాకు ఏ సమస్యా ఎదురయి ఉండేది కాదు.

చిట్టి నా చిన్నమ్మ కూతురు. నాకన్నా అయిదారు సంవత్సరాలు చిన్నది. వాళ్లిల్లు మా ఇంటి పక్కనే ఉండేది. చిట్టి చిన్నప్పటి నుండి గడుగ్గాయే. మేం వాళ్లింట్లోనో, వాళ్లు మా ఇంట్లోనో ఉండేవాళ్లం. అప్పట్లో అందరం కలిసి పది మందిమి ఉండేవాళ్లం. చిట్టిదే పయి చేయిగా ఉండేది. అందరినీ ముప్పుతిప్పలు పెడుతుండేది. ఎందువలనో నా జోలికి మటుకు వచ్చేది కాదు. ఈసారి నన్ను వదలలేదు.

ఏడెనిమిది సంవత్సరాల తర్వాత కలవడం వలన ఆ రాత్రి భోజనాలయ్యాక తీరికగా కూర్చుని చిన్నప్పటి సంగతులు చెప్పుకోవడం మొదలెట్టాం. మాతోపాటు నా రెండో కూతురు ప్రియ కూర్చుంది. ప్రియ డిగ్రీ చివరి సంవత్సరంలో ఉంది. నాకు ఇద్దరే సంతానం. పెద్దమ్మాయికి పెళ్లి అయి భర్తతో బెంగుళూరులో ఉంటోంది. నా భార్య చనిపోయి పన్నెండు సంవత్సరాలు గడిచాయి.

చిట్టి చిన్ననాటి సంగతులు ఒక్కొక్కటి గుర్తు చేస్తోంటే వెనక్కి వెళ్లిపోతున్నట్లు అనిపించసాగింది. చిట్టి మాటకారి. ఏమీ లేని విషయాన్ని కూడా చక్కగా చెప్పగలుగుతుంది. ముందు తన కుటుంబ విషయాలు ఒక గంటపాటు మాకు కథలా వినిపించింది. తర్వాతి ప్రస్తావన నా మీదకు జరుపుతుందని నేను అనుకోలేదు.

"వదిన చనిపోయి పదేళ్లు కాలేదూ?" అడిగింది.

"పన్నెండు సంవత్సరాలు గడిచాయి" అన్నాను.

"వదిన మనందరికీ లింకులా ఉండేది. అందరినీ కలుపుకుని నడిచేది. నీకంత కలుపుగోలుతనం లేదు. ఆమె చనిపోయాక నువ్వూ నీ పిల్లలూ మన ఊరు ఎన్నిసార్లు వచ్చారేమిటి?

**కథ**

"రావాలనే అనుకుంటుంటాం. ప్రియ చదువు పూర్తయితేగాని మాకు తీరిక చిక్కదు".

"నీకు సర్వీసు ఇంకెంత ఉందేం?"

"అయిదేళ్లు".

"మీ తమ్ముళ్లంత చదువుకోకపోయినా వాళ్లకన్నా నువ్వే నయం అనిపిస్తోంది. మీ వాళ్లు ఎప్పుడయినా వస్తుంటారా?"

తెలిసి అడుగుతోందో, తెలియక అడుగుతోందో నాకు అర్థం కావడం లేదు. తల అడ్డంగా ఆడించి, "రారు" అన్నాను.

"పోట్లాడుకున్నారా?"

"లేదు".

"నువ్వు వెళ్తే వాళ్లొస్తారు. నువ్వు వెళ్లవు..." అని ప్రియ వయిపు తిరిగి, "పాపా, మీ నాన్న దురదృష్టం ఏమిటోగాని చిన్నప్పటి నుండి మీ నాన్నను అడ్డం పెట్టుకుని మీ చిన్నాయనలు బాగుపడ్డారు. సంతకాలు చేయించుకుని రావలసిన ఆస్తిని రానీయకుండా చేశారు. వాళ్లను తప్పు పట్టి ఏం లాభం? మీ అమ్మ నెత్తీ నోరు కొట్టుకున్నా వినిపించుకునేవాడా...?"

చిట్టి మాటలకు అడ్డు తగలబోయాను. వీలు కానీయలేదు. "నువ్వాగు. అయిదు నిమిషాలపాటు నీ కూతురుతో నన్ను మాట్లాడనీయి. ఈ సంగతులు నీ కూతుళ్లకు తెలిసి ఉంటాయని అనుకోను. వాళ్లకూ తెలియాలి... మీ నాన్న ఇంటర్ రెండో సంవత్సరంలోకి వచ్చేవరకు కాళ్లకు చెప్పులుండేవి కావు. డిగ్రీ మొదటి సంవత్సరంలో అనుకుంటాను, పంట్లాంలు వేయడం మొదలుపెట్టలేదు. మీ తాత దగ్గర డబ్బులు లేక కాదు. మీ నాన్నకు ఖర్చు పెట్టడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. మిగతా వాళ్లకు బాగానే ఖర్చు పెట్టేవాడు. వాళ్లకు అన్నీ ఉండేవి. మీ నాన్నో పిచ్చిమేళం. ప్రతి విషయంలోనూ సర్దుకుపోతుండేవాడు.

"మీ తాతగాని, మీ నానమ్మగాని ఏ విషయంలోనూ మీ నాన్నను ఆయన తమ్ముళ్లతో సమానంగా చూడలేదతడు. పరాయి వ్యక్తిగానే చూసేవాళ్లు. మీ నాన్న పెళ్లి కూడా తూతూ మంత్రంగా జరిపించారు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మీ నానమ్మ



ఘనంగా చేసేది. పిల్లల కోసం పిండి వంటలు చాలా చేయించేది. తిరిగి వెళ్లిపోతున్నప్పుడు అందరికీ పేకెట్లలో పెట్టి ఇచ్చేది. రకరకాల పచ్చళ్లు పెట్టి ఇచ్చేది. మీ నాన్నకు మటుకు ఏం ఇచ్చేది కాదు. ప్రతిసారీ అంతే. మీ నాన్న ఈ విషయాలను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకుని ఉండడు. మీ అమ్మ ఏమనుకునేదో, ఏమో! బాధపడినట్టు నాకు ఎప్పుడూ అనిపించలేదు.

"తల్లిదండ్రుల ప్రేమ పిల్లలందరి మీద సమానంగా ఉంటుంది ఒకప్పుడు అనుకునేదాన్ని. కాదు. చాలామంది ఒప్పుకోరు కాని వ్యత్యాసాలు ప్రతి కుటుంబంలోనూ ఉంటాయి..." ఆగింది.

చిట్టి చెప్పిన విషయాల్లో అబద్ధం ఏమీ లేదు. జరిగి చాలా సంవత్సరాలు గడిచాయి. అమ్మా నాన్న చనిపోయి కూడా అయిదు సంవత్సరాలు దాటాయి. నాకేదో తీరని అపకారం జరిగిందని నేనెప్పుడూ అనుకోలేదు. పాత సంగతులు చిట్టి ప్రియ ముందు చెప్పి ఉండకపోతే బావుండేది. ఆ తర్వాత మా సంభాషణ వేరే విషయాల మీదకు మళ్లింది.

మా కబుర్లు ముగిసేసరికి పదకొండు దాటింది. చిట్టి పడుకోడానికి పక్క గదిలోకి వెళ్లిపోయింది. నేను మధ్య గదిలో పడుకుంటాను. నిద్రకుపక్రమిద్దామని లయిటు ఆర్పేయబోతూ ఆగాను. ప్రియ కుర్చీలో కూర్చునే ఉంది. చిట్టి చెప్పిన విషయాల గురించి ఆలోచిస్తోందేమో ముఖం గంభీరంగా ఉంది.

"నిద్ర రావడం లేదమ్మా?" అడిగాను.

"లేదు" తల అడ్డంగా ఆడించింది.

"నాకు మంచినీళ్లు తెచ్చిపెడతావూ?"

కుర్చీ దిగి వంటగదిలోకి వెళ్లబోతూ ఆగి, "చిట్టి ఆంటీ చెప్పిన విషయాలు నిజమేనా?" అడిగింది.

నవ్వాను. అవుననలేదు. కాదనలేదు.

వంటగదిలోకి వెళ్లి గ్లాసునిండా మంచినీళ్లు తీసుకువచ్చి నాకందిస్తూ, "నిజమే కదూ నాన్నా?" అడిగింది. ప్రియ బాధపడుతున్నట్టు నాకు అనిపించింది.

తలూపి మంచం మీద కూర్చున్నాను. ప్రియ అక్కడే నుంచుంది.

"వెళ్తూ లయిటార్పేసి వెళ్లు".

"మీరంటే నాయనమ్మకు ఏమాత్రం ఇష్టం లేనప్పుడు ఆమె పేరు నాకు ఎందుకు పెట్టారు?"

మా అమ్మపేరు ప్రియంవద. నా కూతురు పేరు కూడా అదే.

"మా అమ్మ అంటే నాకు ఇష్టమమ్మా. నువ్వు పుట్టిన తర్వాత ఉద్యోగపరంగా నాకెంతో కలిసివచ్చింది. నేను పోగొట్టుకుంది తిరిగి పొందినట్టు అనిపించింది. అందుకే నీకాపేరు పెట్టాను".

నా జవాబు ప్రియకు నచ్చిందో, లేదో కాని ప్రియ గదిలోని లయిటు చాలాసేపటివరకు వెలుగుతూనే ఉంది.

## 'రజనీ'కి పద్మవిభూషణ్‌కై డిమాండ్

. ఇటీవలి కాలంలో రచయితలు, కవులు కలుసుకుంటున్నారు, మాట్లాడుకుంటున్నారు, పరస్పరం అభిప్రాయాల్ని వ్యక్తీకరించుకుంటున్నారు. వేదికల్ని రూపొందించుకుంటున్నారు. ఈ క్రమంలో భాగంగానే మార్చి 29వ తేదీన హైదరాబాద్‌లోని ఎ.ఎస్.రావునగర్‌లో కొంతమంది సృజనశీలురు కలిసి 'కోకిలమ్' అనే సాహిత్య, సాంస్కృతిక వేదికని ఏర్పాటుచేశారు. సృజనాత్మక రంగంలో విలక్షణమైన కార్యక్రమాలు చేపట్టాలన్న తపన ఈ వేదిక ఆవిర్భావానికి మూలం. రచయితల, కవుల మధ్య తరచుగా సంభాషణలు జరగాలని, అందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని 'కోకిలమ్' కన్వీనర్, ప్రముఖ కథా రచయిత పులిగడ్డ విశ్వనాథరావు చెప్పారు.

## సాహిత్యోద్యమాల్లో కొత్తస్వరం 'కోకిలమ్'



మార్చి 29 ఆదివారంనాడు బాలాంత్రపు రజనీకాంతరావు జ్యోతిప్రజ్వలన చేసి ఈ సంస్థని ఆరంభించారు. ఈ తొలి సమావేశంలో శీలావీర్రాజు, సలీం, సుగమ్‌బాబు, పాలంకి సత్య, పీశుపాటి ఉమామహేశ్వరం, కస్తూరి మురళీకృష్ణ, కె.పి.అశోక్‌కుమార్, నాళేశ్వరం శంకరం, శీలా సుభద్రాదేవి, వై.వసంత, పురాణం శ్రీనివాసశాస్త్రి, పాలంకి సత్యనారాయణ, మార్పు గోపినాథ్, రంగాచారి, రామ్మోహనరావు, అవనిగడ్డ సూర్యప్రకాష్, సాంధ్యశ్రీ, బాలాంత్రపు వెంకోబ్ మొదలయిన వారు పాల్గొన్నారు. సృజన వికాసానికి తోడ్పడే కార్యక్రమాలు చేపట్టాలనేది 'కోకిలమ్' ఆశయం. సంగీతం, సారస్వత రంగాలకి విశేష సేవలు అందించిన బాలాంత్రపు రజనీకాంతరావుకు పద్మవిభూషణ్ పురస్కారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 'కోకిలమ్' ఆరంభ సభ తీర్మానించింది.